క్లుప్తంగా

రుణాల అవినీతిపై విచారణ

తొర్రూరు రూరల్: మహిళా సంఘాలు అందించిన రుణాల అవినీతి, అక్రమాలపై మండలంలోని అమ్మాపురం గ్రామంలో జిల్లా సెర్ప్ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. అధికారులు ప్రశాంత్‌రెడ్డి, సీతారాముల, ఏపీఎం సంజీవ ఆధ్వర్యంలో విచారణ చేసి, రికవరీకి ఆదేశాలు జారీ చేశారు.

రూ.50వేల విరాళం



మహబూబాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన ఏకశిలా హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50వేల విరాళం చెక్కును శనివారం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు అందజేశారు. కలెక్టర్ వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ



కొత్తగూడ: ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో మండల కేంద్రంలోని క్రీడా పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించినట్లు హెచ్‌ఎం సారయ్య శనివారం తెలిపాడు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



కురవి: మండలంలోని నేరడ మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వై.శ్రీకాంత్, పీడీ సురేష్ శనివారం తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన పోటీల్లో అంజిత, శ్రీజ, నందిని, హజీమ, అక్షిత, అశ్విత, వర్షిణి, సింధు, విక్రమ్, వెంకటేష్, జయరాజ్, బన్నిలు ఎంపికయ్యారు. సిరిసిల్లలో 21నుంచి 23 వరకు జరుగు పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయులు అభినందించారు.

స్పోర్ట్స్ టీంల ఎంపిక

గూడూరు: ఈనెల 29, 30 తేదీల్లో జరిగే జోనల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనుటకు శనివారం స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో టీంల సెలక్షన్ జరిగింది. అనంతరం ప్రాక్టీస్ చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ చంద్రశేఖర్‌రావు, ఎఫ్ఆర్వో సురేష్ పాల్గొన్నారు.

25న ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాలు

నెల్లికుదురు: ఈనెల 25న మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో 68వ మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల ఫిజికల్ డైరెక్టర్ ఐలయ్య శనివారం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని 14, 17ఏళ్ల లోపు బాలబాలికలకు క్రీడోత్సవాలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడల్లో పాల్గొనే బాలబాలికలు ఆధార్‌కార్డు, బోనోఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో పీఈటీలు శ్రీనివాస్, ఇమామ్, కొమురయ్య పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

కురవి: సర్వీసులో ఉండి చనిపోయిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడు బలాష్టి రమేష్ అన్నారు. శనివారం సీరోలు మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో బాబురావు, రమేష్, సాయిబాబా, కార్తీక్ పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



గార్ల: మండలంలోని గోపాలపురం సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణిలకు శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం పెద్దకిష్టాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి, సూపర్‌వైజర్ సంపూర్ణ, నీలాదేవి పాల్గొన్నారు.

ఆటల పోటీలు

దంతాలపల్లి: మండలకేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాల, మహాత్మ జ్యోతిరావు పూలే విద్యార్థులకు శనివారం పరుగుపందెం పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ వివేక్‌రామ్ మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ అఫ్జర్ పాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు జీవాల మృతి



దంతాలపల్లి: గున్నెపల్లిలో మృతి చెందిన గేదె, దూడ



మహబూబాబాద్ రూరల్: బోరింగ్ తండాలో మృతి చెందిన మేక



గార్ల: గోపాలపురంలో మృతి చెందిన గేదె

దంతాలపల్లి: మండలంలో శనివారం సాయంత్రం పిడుగుపాటుకు పాడి గేదె, దూడ మృతి చెందగా.. అక్కడే ఉన్న రైతుకు పెను ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గున్నెపల్లి గ్రామానికి చెందిన రైతు పాతూరి అశోక్‌రెడ్డి కొట్టంలో ఉన్న గేదెపాలు పిండుతున్నాడు. సాయంత్రం కురిసిన వానకు కొట్టంపై పిడుగుపడింది. గేదె, దూడ మృతి చెందగా అశోక్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చనిపోయిన గేదె విలువ రూ.70వేలు ఉంటుందని స్థానికులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఆర్‌ఐ నిజాముద్దీన్, కార్యదర్శి మధు పరిశీలించారు.

పిడుగుపాటుకు మేకల మృతి.. రైతుకు తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: పిడుగుపాటుకు రెండు మేకలు మృతిచెందగా ఓ రైతుకు తీవ్రగాయాలైన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారు బోరింగ్ తండాలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. తండాకు చెందిన బానోత్ రాములు పొలం వద్ద వ్యవసాయ బావికి మోటారు బిగిద్దామని వెళ్లాడు. అంతలోనే వర్షం మొదలవగా అక్కడే ఉన్న ఓ చెట్టు సమీపంలో పిడుగుపడి రెండు మేకలు మృత్యువాతపడగా రాములుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆయనను ఆస్పత్రికి తరలించారు.

పాడిగేదె మృతి..

గార్ల: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన రైతు చింతల కోటేశ్వరరావు పాడిగేదె పిడుగుపడి శనివారం మృతిచెందింది. రైతు గేదెను మేతకు వదిలిపెట్టగా గ్రామ సమీపంలోని ఆంగోత్‌తండా వద్ద పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందింది. దాని విలువ రూ.1,20,000 ఉంటుందని బాధిత రైతు విలపించాడు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి



కేసముద్రం: నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

కేసముద్రం: మండల కేంద్రంలో ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సాలమ నర్సయ్య, కోశాధికారి మామిడాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సామల ఉపేందర్, మండల కార్యదర్శి సమ్మయ్య, లక్ష్మీనారాయణ, మాద కుమార్, క్రిష్ణ, రాపోలు శ్రీనివాస్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడ: కొండా లక్ష్మణ్ బాపూజీకి ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు కుసుమ రాజన్ బాబు కోరారు. లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని మండల కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో దేవులపల్లి రాజు, గుర్లెపెల్లి శ్రీను, వేణు, నాగరాజు, చందు, శ్రీను, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న వీరయ్య

దంతాలపల్లి: ఎన్నికల ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అలువాల వీరయ్య అన్నారు. మండలంలోని దాట్ల గ్రామంలో శనివారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు గాలికి వదిలేసిందన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరను వెంటనే అమలు చేయాలని కోరారు. రాష్ట్రం ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం గ్రామ సీపీఎం కార్యదర్శిగా కొమ్మినేని వెంకటరామ నర్సయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు గునిగంటి మోహన్, ఎండి యాకూబ్, బాణాల రాజన్న, బోరస్వామి, బండి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న రాజమౌళి

నెహ్రూసెంటర్: జిల్లాలో ఎకరాల కొద్ది అన్యాక్రాంతం, ఆక్రమించుకున్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి అన్నారు. జిల్లా కేంద్రంలోని గుండ్లకుంట కాలనీలో శనివారం పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారని, 58 జీవో కింద పట్టాలు సైతం మంజూరయ్యాయని పేర్కొన్నారు. ముప్పై ఏళ్ల నుంచి జీవిస్తున్న ప్రజల ఇళ్లు కూల్చివేస్తామని నోటీసులు ఇస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. పేదలకు ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పేదల పక్షాన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో చాగంటి భాగ్యమ్మ, పూల సురేష్, వెంకటాద్రి, రాణి, దుడ్డేల సుజాత పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ కమిటీ ఎన్నిక

కేసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో టీపీటీఎఫ్ మండల నూతన కమిటీని శనివారం సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సురేందర్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహరాజు, ఉపాధ్యక్షులు రాధిక, కొమ్ము రాజేందర్, జిల్లా కౌన్సిలర్లుగా చీకటి వెంకట్రాంనర్సయ్య, అంజయ్య, సదయ్య, కార్యదర్శులుగా మోహనకృష్ణ, చందర్, నర్సయ్య, ప్రణయ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్: సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ హైదరాబాదులో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి విన్నవించామని రాష్ట్ర దడవాయిల సంఘం అధ్యక్షుడు సరసాని సురేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి బోనాల వీరన్న శనివారం తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు ఈటెల దేవేందర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కీసరి రాంబాబు రాజీవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైనికుల్లా పని చేయాలి

గూడూరు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు చీదురు వెంకన్న, నూకల సురేందర్, రహీం పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం..



గార్ల: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

గార్ల: స్వచ్ఛ తా హీ సేవా కార్యక్రమం పురస్కరించుకొని శనివారం గార్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం అంటూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంగమ్మ, ప్రిన్సిపాల్ రాజకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కురవి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు చెందిన విద్యార్థినులు శనివారం మండల కేంద్రంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్‌ను సేకరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.లీల ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రమాదేవి, రోహిణి, హరిణి, నవత, రామారావు, శిరీష, చంద్రరీక పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కేసముద్రం: మండలంలోని కల్వల మోడల్ స్కూల్‌లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు తెలుగు బోధించడానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నవీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులతో ఈనెల 23న ఉదయం 10గంటలకు మోడల్ స్కూల్‌లో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నాడు.

ఘన సన్మానం

కేసముద్రం: టీఎస్‌పీఎస్సీ ఇటీవల విడుదల చేసిన గురుకుల ఎడ్యుకేషన్ సొసైటీ పీఈటీ ఫలితాల్లో మైనార్టీ విభాగంలో కేసముద్రంస్టేషన్‌కి చెందిన మహమ్మద్ నసీరుద్దీన్ స్టేట్ 7వ ర్యాంక్ సాధించాడు. ఈమేరకు శనివారం మండలంలోని తాళ్లపూసపల్లి జెడ్పీహైస్కూల్‌లో నసీరుద్దీన్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోట కనకయ్య, గోపికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పీఆర్టీయూ పనిచేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శనివారం పీఆర్టీయూ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా భూక్య రాంజీనాయక్, ప్రధాన కార్యదర్శి కాపరబోయిన సుజాత, అసోసియేట్ అధ్యక్షులు నాగరాజు, ఉపాధ్యక్షులు విజయ్, కౌసల్య, కార్యదర్శులు మధు, సుశీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి, మా వీరారెడ్డి, మురళీధర్‌స్వామి, గీత, ఉమదేవి, హల్యా, చిట్టిబాబు పాల్గొన్నారు.

నెల్లికుదురు మండల కమిటీ ఎన్నిక

నెల్లికుదురు: పీఆర్‌టీయూ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు సంకబద్రినారాయణ, ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి శనివారం తెలిపారు. మండల అధ్యక్షుడిగా కొత్త నర్సింహరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గొట్టిముక్కుల శ్రీనివాసరెడ్డితో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న శ్రీశైలం

మహబూబాబాద్ అర్బన్: అసంబద్ధమైన ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులు ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. సర్దుబాటు ఆదేశాలు వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు కాలం చెల్లిన రేషనలైజేషన్ నిబంధనలు సవరించాలన్నారు. మూసిన బడులను తెరిపిస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు ఉన్న బడులను మూసివేసే విధానాలను అమలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో యాకయ్య, శ్రీనివాస్, పద్మావతి, మధుసూదన్, ప్రవీణ్, రాజు, తదితరులు పాల్గొన్నారు. రేషనలైజేషన్ జీఓ 25 నిబంధనలను మార్చాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకుబ్ డిమాండ్ చేశాడు.

గెస్ట్ లెక్చరర్లను రెన్యువల్ చేయాలి



మాట్లాడుతున్న నారాయణ

తొర్రూరు: గెస్ట్ లెక్చరర్లను రెన్యువల్ చేయాలని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ అన్నారు. డివిజన్ కేంద్రంలో శనివారం అతిథి అధ్యాపకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అతిథి అధ్యాపకుల రెన్యూవల్ వ్యవహారంలో ఇంటర్ బోర్డు రాష్ట్ర ఫైనాన్స్ విభాగానికి తప్పుల తడకగా జాబితా ఇచ్చిందని, దీంతో 65 మంది గెస్ట్ లెక్చరర్లు రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. తొర్రూరు కళాశాలలోని ఫిజిక్స్, బాటనీ గెస్ట్ లెక్చరర్లను వెంటనే రెన్యువల్ చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శివరామకృష్ణ, అలీ, రాజేష్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థికసాయం

నెల్లికుదురు: మండలంలోని రావిరాల గ్రామంలో చెరువు కట్ట తెగిపోడవంతో నీరు వృథాగాపోతుంది. వృథాగా నీరుపోకుండా పంటల సాగు కోసం తూము వరకు కాల్వ పనుల మరమ్మతులకు గ్రామానికి చెందిన బట్టు భూలోకరావు, బట్టు నాని రూ.40వేలు, బట్టు మాధవరావు రూ.10వేలు శనివారం ఆర్థికసాయం అందించినట్లు రైతులు తెలిపారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని కిష్టాపురం కాలనీకి చెందిన లక్ష్మి అనే మహిళ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈమేరకు బాధిత కుటుంబాన్ని సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ పరామర్శించి, రూ.3వేల ఆర్థికసాయం అందజేశాడు.

సమరయోధుల బాటలో నడవాలి

నెల్లికుదురు: స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన సమరయోధుల బాటలో యువత నడిచి దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎస్సై చిర్ర రమేష్‌బాబు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మర్రికుంట్ల అనిల్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేసి పూలమాలలు వేసి ఆయన సేవలను గుర్తు చేశారు.

చెక్కు అందజేత



గూడూరు: మండలంలోని మర్రిమిట్టకు చెందిన గుంటుక వినయ్ అనే ఫొటోగ్రాఫర్ 4నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి శనివారం మండల ఫోటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.1లక్ష 60వేల విలువ చేసే చెక్కును అందించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు నీలం రమేష్, బొమ్మెర్జు వెంకన్న, మండల అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నబోయిన లక్ష్మణ్, శ్రీరాం పాల్గొన్నారు.

టీ షర్టుల పంపిణీ

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం దాత రావుల వెంకట్‌రెడ్డి మాతృమూర్తి సుగుణమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు రూరల్ ఎస్సై దీపికారెడ్డి టీషర్ట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోవర్ధన్, కాంప్లెక్స్ హెచ్‌ఎం పూజారి వీరయ్య, మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

దోర్నకల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి దాసరి మల్లేశం డిమాండ్ చేశాడు. శనివారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ డోర్నకల్ ప్రాజెక్ట్ ప్రతినిధులు ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ శ్రీలక్ష్మికు వినతిపత్రం అందజేశారు.

అన్నదానం

మహబూబాబాద్: అన్నిదానాల కంటే అన్నదానం మిన్న అని గ్లోబల్ పీస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బి.బాలునాయక్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్వోబీ కింద నివాసం ఉంటున్న అనాథలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నవీన్ రెడ్డి, సురేందర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

మరిపెడ/మరిపెడ రూరల్: మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని ప్రోగ్రాం మేనేజర్ శాంతరాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మల్సూర్, రజిత, సత్తమ్మ పాల్గొన్నారు.

నిందితుడిని ఉరి తీయాలి

కొత్తగూడ/గంగారం: జైనూర్‌లో జరిగిన సంఘటనకు నిరసనగా తుడుందెబ్బ తలపెట్టిన బంద్ మండలకేంద్రంలో సంపూర్ణంగా ముగిసింది. ఈసందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి మాట్లాడుతూ.. నిందితుడిని బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశాడు. గూడూరు సీఐ బాబూరావు, ఎస్సై కుశకుమార్‌లు బందోబస్తు నిర్వహించారు.

చర్య తీసుకోవాలి

బయ్యారం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జైనూర్‌లో ఆదివాసీ మహిళపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని తుడుందెబ్బ జిల్లా నాయకుడు నరేష్ శనివారం డిమాండ్ చేశాడు.

పరామర్శ..

గార్ల: పిడుగుపాటుకు గురై మృతిచెందిన అల్లం ప్రవీణ్ మృతదేహాన్ని శనివారం ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థికసాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో బుద్ధుడి విగ్రహం ఆవిష్కరణ



దోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన 2009–10బ్యాచ్ పూర్వ విద్యార్థిని సీరోలు మండలం మన్నెగూడెంకు చెందిన కల్పన తన సొంత ఖర్చులతో పాఠశాలలో ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహాన్ని హెచ్‌ఎం రుక్మాంగదరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి లక్ష్మా, హెచ్‌ఎంలు విత్తనాల సుధాకర్, బంగారి, పాల్గొన్నారు.

30కిలోల నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని బయ్యారం మండలం కొత్తపేట, కొయ్యగూడెం గ్రామ శివారు చెరువు ముందు తండాకు చెందిన గుగులోత్ వెంకటేష్, మరిపెడ మండలం మంగోలి గూడెం గ్రామానికి చెందిన బానోతు నరేష్‌లు అక్రమంగా తరలిస్తున్న 30కిలోల బెల్లం, 20కిలోల పటిక, 8 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నామని డీటీఎఫ్ సీఐ నీరజ శనివారం రాత్రి తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

క్రైం కార్నర్..

చికిత్స పొందుతున్న రైతు మృతి




శ్రీనివాస్ (ఫైల్)

పెద్దవంగర: ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన కోటగిరి శ్రీనివాస్(42) వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయం పెట్టుబడులు, సొంత గృహ నిర్మాణానికి అప్పులు చేశాడు. దీంతో మనస్తాపానికి గురై శుక్రవారం ఉదయం పొలం వద్ద పురుగుల మందు తాగాడు. భార్య రజిత పొలం వద్దకు వెళ్లి చూడగా పడిపోయి ఉండడంతో వెంటనే తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

కాపర్ వైరు చోరీ

తొర్రూరు రూరల్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ వైరును దొంగిలించిన సంఘటన మండలంలోని నాంచారీమడూరు గ్రామ శివారులో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. రైతులు తెలిపిన వివరాలు.. ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులో ఉండే కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



తొర్రూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న మామిడి కలపను మండలంలోని మడిపెల్లి గ్రామశివారులో అటవీశాఖ అధికారులు శనివారం పట్టుకున్నారు. ఈసందర్భంగా అటవీ శాఖ అధికారి రేణుక మాట్లాడుతూ.. కేసముద్రం నుంచి వరంగల్ వైపు మామిడి కర్రలను డీసీఎం వాహనంలో వాహనంలో తీసుకెళ్తుండగా పక్కా సమాచారంతో సుమారు రూ.60వేల విలువ చేసే 12 టన్నుల కర్రలను స్వాధీనం చేసుకున్నామన్నారు. డీసీఎం వాహనాన్ని సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మరిపెడ రూరల్: ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గుగులోతు రవి అన్నారు. శనివారం మండలంలోని అబ్బాయిపాలెం, మర్రిగూడెంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీలక్ష్మీ, ఏఎన్ఎం చంద్రకళ, తరుణి, ఉపేంద్ర, ఆశలు పాల్గొన్నారు.

ఉద్యమకారుల కమిటీ ఎన్నిక

కేసముద్రం: మండల ఉద్యమకారుల కమిటీ అధ్యక్షుడిగా చాగంటి కిషన్ ఎన్నికయ్యాడు. శనివారం మండల కేంద్రంలో కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కట్టమల్లు, ప్రధాన కార్యదర్శిగా షేక్‌ఖాదర్, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్, గౌరవ సలహాదారులుగా దస్రూనాయక్, యాకయ్య, అశోక్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, రామ్మూర్తి, శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్ స్టాలిన్, ఉపాధ్యక్షుడిగా వెంకన్న, సభ్యులను ఎన్నుకున్నారు.